ప్రశాంతంగా పోలింగ్

- వెల్లువెత్తిన చైతన్యం
- ఫలించిన అధికారులు చర్యలు


పెందుర్తిలో పోలింగ్ సరళిపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


వేపగుంట జెడ్పీ హైస్కూల్‌లో బారులు తీరిన పట్టభద్రులు


సబ్బవరం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన అనకాపల్లి జేసీ కల్పనా కుమారి


చిన్నారిని ఎత్తుకుని ఓటు వేయడానికి వస్తున్న మహిళ

సింహాచలం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం పెందుర్తి నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి వెళ్లడానికి ముందే గుర్తింపు కార్డులు, ఓటరు స్లిప్‌లు చూసి పోలీసులు లోపలికి అనుమతించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపేశారు. దీంతో పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. నాలుగు గంటల్లోపు వచ్చిన వారిని మాత్రమే అనుమతించారు. దీంతో పలువురు వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో పలు కేంద్రాల్లో రాత్రి వరకూ పోలింగ్ సాగింది.

పెందుర్తిలో 63.07 శాతం పోలింగ్ నమోదు

పెందుర్తి మండలంలో ఐదు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన తొమ్మిది బూత్‌లలో పోలింగ్ నిర్వహించారు. మండలంలో 63.07 శాతం పోలింగ్ నమోదైంది.. మొత్తం 9811 మందికి ఓటర్లకు గాను 6188 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 3415మంది పురుషులు, 2773 మంది మహిళలు ఉన్నారు. వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లోని పోలింగ్ బూత్ 279లో సాయంత్రం 6గంటల వరకు, 280 పోలింగ్ బూత్‌లో రాత్రి 7గంటల వరకు పోలింగ్ జరిగింది. అలాగే పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూ ల్లో కూడా సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆయా పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పలు కేంద్రాలను సందర్శించారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెందుర్తి ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పర్యవేక్షించారు.

పరవాడలో 71.12 శాతం పోలింగ్

పరవాడ: పరవాడలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 2102 ఎమ్మెల్సీ ఓటర్లకు సంబంధించి పరవాడ, ఉక్కునగరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1495 ఓట్లు పోలవగా 71.12 శాతంగా నమోదైంది. పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలలో రెండు, ఉక్కునగరం జ్యోతి బాల విహార్ పాఠశాలలో రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం వరకు కొంత మందకొడిగా సాగినప్పటికీ ఆ తర్వాత ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఎండ వేడిమికి ఓటర్లు కొంత ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. పోలింగ్ సందర్భంగా పరవాడ జెడ్పీటీసీ పి.ఎస్.రాజు కారును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అనకాపల్లి ఎస్పీ గౌతమిశాలి, ఏఎస్పీ విజయభాస్కర్, డీఎస్పీ పి.శ్రీనివాసరావులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ పి.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఎస్‌ఐలు మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు దగ్గరుండి ఓటింగ్ సరళిని సమీక్షించారు.

సబ్బవరంలో 66.15శాతం పోలింగ్

సబ్బవరం: సబ్బవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు 200,200ఎలలో పోలింగ్ నిర్వహించారు. మొత్తం 1971 మంది ఓటర్లకు గాను 1,304 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 66.15 పోలింగ్ శాతం నమోదయిందని ఏఆర్‌వో బి. సత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి 200ఎ పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

మండల వారీగా పోలింగ్ వివరాలు

పోలింగ్ బూత్ నంబర్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
పెందుర్తిలో..		
219	1330	852
220	1268	741
221	1205	810
222	1299	833
223	965	594
224	827	475
279	810	560
279ఏ	856	542
280	1251	781
	9811	6188
పరవాడలో..		
201	1000	731
201ఏ	890	602
202	127	100
202ఏ	85	62
	2102	1495
సబ్బవరంలో..		
200	1072	719
200ఏ	899	585


చినముషిడివాడ ఎంపీపీ స్కూల్ వద్ద ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు


పరవాడలో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు


జెడ్పీటీసీ పి.ఎస్.రాజు కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

డీ-వార్మింగ్ మాత్రల పంపిణీ నేడు

పరవాడ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. 1–19 ఏళ్ల బాల బాలికలందరికీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో నులి పురుగుల మాత్రలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా


డ్రా తీస్తున్న ఈవో

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌లో స్టాళ్లకు సోమవారం డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఉదయం 12 గంటలకు రైతుబజార్ ఎస్టేట్ అధికారి వరలక్ష్మి సమక్షంలో ఈ డ్రా తీశారు. తమకు కేటాయించిన స్టాళ్లలో రైతులు బుధవారం నుంచి విక్రయాలు జరపనున్నారు. మంగళవారం రైతుబజార్‌కు సెలవు. ప్రతి సోమవారం డ్రా తీసి రైతులకు స్టాళ్ల కేటాయింపు చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి తెలిపారు.

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం

బీచ్ రోడ్డు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా బోధన అవసరమని జోన్-1 ఆర్‌ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. పెద్దవాల్తేరులోని సన్ ఫ్లవర్ స్పెషల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, అనాథలకు మంచి విద్యను అందించేందుకు కొన్నేళ్లుగా కృషి చేస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ వేడుకల్లో భాగంగా దివ్యాంగులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ జీఎం ప్రసాద్, రాణా ఉప్పలపాటి, పాలిక శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాల్గవ తరగతి ఉద్యోగులు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం సోమవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఏపీజేఏసీ పిలుపు మేరకు ఈ కార్య క్రమం కొనసాగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న రెవెన్యూ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యల సాధనకు పోరాటం సాగిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సహ అధ్యక్షుడు లోకేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పైడిమాంబ జాతర నేడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం జరగనుంది. ఆలయంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డులో ప్రత్యేకంగా ఆర్చ్‌లను తీర్చిదిద్దారు. జాతరలో భాగంగా ఉత్సవ కమిటీ చైర్మన్లు ములగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ 7న ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేయడంతో పాటు ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్నారు. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ రాయభారం, సత్యహరిశ్చంద్ర తదితర నాటకాలతో పాటు పిట్టలదొర అనే హాస్యవల్లరి, సినీ డూప్స్, బుర్రకథ, రేలారే రేలా తదితర కార్యక్రమాల ప్రదర్శనలు అలరించాయి. జాతరకు ముందు రోజు సోమవారం సాయంత్రం నుంచి పరస ప్రారంభమైంది. మంగళవారం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

కవయిత్రి మొల్ల రచనలు ఆదర్శం


కవయిత్రి మొల్ల జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

పరవాడ: రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులో అనువదించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని సోమవారం గొర్లివానిపాలెం కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గొర్లి గోపిఅమ్మలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కుమ్మరి సాలివాహన సంఘ అధ్యక్షుడు కొత్తూరు గెడ్డప్ప తదితరులు మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సర్పంచ్ గొర్లి గోపీఅమ్మలు మాట్లాడుతూ అగ్రవర్ణాలను ఎదురించి పోరాటాలు చేసి చదువు సాగించి రామాయణాన్ని రచించిన ఘనత మొల్లకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ డి.అర్జున వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎ.రామస్వామి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కె.కనకారావు, జిల్లా కార్యదర్శి భాస్కరరావు, అనకాపల్లి నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో సునీత

పరవాడ: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంఈవో ఎం.సునీత సిబ్బందిని హెచ్చరించారు. భర్నికం మండల పరిషత్ పాఠశాలను ఎంఈవో సునీత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ పుస్తకాలు, మెనూకి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. టాయిలెట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.కవిత పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలం


మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన గణాంకాలను చూపుతున్న శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. మానవ హక్కులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తాము నిరంతరం కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు.

ఆధ్యాత్మికం

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమపూజలు నిర్వహించారు. శివ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వైభవంగా నిత్యకల్యాణం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు పోలిపిల్లమ్మ వార్షిక పండగ

- విశేషంగా ఏర్పాట్లు



సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధి అప్పన్నపాలెం వాసుల ఆరాధ్యదేవత పోలిపిల్లమ్మ తల్లి వార్షిక పండగను మంగళవారం విశేషంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ ,ప్రసాద వితరణ చేస్తున్నట్టు చెప్పారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని గరగల డ్యాన్స్, బాణసంచా భారీ ఎత్తున కాల్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నుంచి మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉరివిడి ఈశ్వరరావు, ట్రెజరర్ నూనెల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని వైద్య సేవలు
- అందుబాటులోకి రక్త పరీక్షలు


ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ శశిప్రియాంక

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. వీటితోపాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 18 రకాల రక్త పరీక్షలు, 55 రకాల ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంచరపాలెం ఆర్పీ పేట, జ్ఞానాపురం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వైద్య పరీక్షలకు అదనంగా మరో 8 రకాల పరీక్షలను ప్రభుత్వం ప్రజల ముందుకు తెచ్చింది.

24 గంటల్లో ఫలితాలు : కంచరపాలెం పీహెచ్‌సీకి ప్రతి రోజు 80 నుంచి 140 మంది వరకు రోగులు వస్తుంటారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్లు, రక్త పరీక్షలకు కావాల్సిన ల్యాబ్ సామగ్రిని అందుబాటులో ఉంచారు. రోగులకు సంబంధించి రక్త నమూనాలను సిబ్బంది సేకరించి 24 గంటల్లో ఫలితాలను తెలియజేస్తారు. ఈ పరీక్షల వల్ల రోగికి నగదు ఆదా అవడమే కాకుండా శ్రమ కూడా తగ్గుతుంది.

రక్త పరీక్షల వివరాలు..

- టీఎస్‌సీ(తెల్ల రక్త కణాల లెక్కింపు)
- డీఎస్‌సీ(ఐదు రకాల రక్త కణాలకు సంబంధించిన పరీక్ష)
- ప్లేట్‌లెట్స్ కౌంట్
- ఎస్.బిలిరుబిన్(కామెర్లు)
- ఆర్‌పీఆర్
- డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్
- స్టూల్ ఫర్ ఓవా అండ్‌సిస్ట్ (విరేచనాలకు సంబంధించి)
- టీబీ అండ్ డాట్స్(క్షయకు సంబంధించి పరీక్షలు)

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు


రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. డ్వాక్రా స్టాళ్లలో సంబంధిత మహిళలే ఉండాలన్నారు. ఆకుకూరల రైతులు యాసిన్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

మహిళా దినోత్సవ సందడి


వేడుకలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు


నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో..

సీతంపేట: శారదా స్వర సంగమం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఆటపాటలతో సందడి చేశారు. సంస్థ అధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు కరోకి ట్రాక్ సాంగ్స్ ఆలపించి అలరించారు. మహిళలు ప్రతిభా ప్రదర్శనలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వేడుకల్లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రా ఆర్టిస్ట్స్ డైరెక్టర్ సన్‌మూర్తి, గాయకులు వి.రామ్‌కుమార్, బాలాజీ, ధనలక్ష్మి, సాత్విక, రేణుక, రవిచంద్ర, గీత, లక్ష్మి, స్వరూప, కవిత పాల్గొన్నారు.